క్లుప్తంగా

దత్తాత్రేయస్వామికి విశేష పూజలు



శ్రీశైలంటెంపుల్ : లోకకల్యాణం కోసం శ్రీశైల దేవస్థానం గురువారం సందర్భంగా ఆలయ ప్రాంగణంలోని త్రిఫల వృక్షం కింద వెలసిన శ్రీదత్తాత్రేయస్వామికి విశేష పూజలను దేవస్థానం ఈఓ, అర్చకులు నిర్వహించారు. పూజా కార్యక్రమాలు నిర్విఘ్నంగా జరిగేందుకు ముందుగా మహాగణపతి పూజ జరిపించారు. అనంతరం దత్తాత్రేయస్వామికి అభిషేకాది, అర్చనలు చేసి ప్రసాద వితరణ గావించారు.

తాండవమల్లేశ్వరస్వామికి కార్తీక పూజలు

కొత్తపల్లి: మండల కేంద్రంలోని అతిపురాతన ఆలయమైన శ్రీ తాండవ మల్లేశ్వరస్వామి ఆలయంలో భక్తులు గురువారం కార్తీక పూజలు చేసుకొన్నారు. ఆలయ అర్చకులు మల్లికార్జున ఆచారి స్వామికి అభిషేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

వికసిత్ భారత్ సంకల్ప యాత్ర

వెలుగోడు: మండలంలోని మోతుకూరు, మాధవరం గ్రామాల్లో గురువారం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా డ్రోన్ టెక్నాలజీ, కేంద్ర పథకాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏఓ పవన్ కుమార్ కేంద్ర ప్రభుత్వం గ్రామీణ ప్రజలు, రైతులకు అందిస్తున్న పలు సంక్షేమ పథకాల గురించి వివరించారు. వ్యవసాయంలో డ్రోన్ టెక్నాలజీపై ఏవో పవన్ కుమార్ అవగాహన కల్పించారు. రైతు శిక్షణా కేంద్రం ఏఓ హేమలత, ఏఈఓ సుధారాణి, ఆర్బీకే ఇన్‌చార్జ్ నాగలింగం పాల్గొన్నారు.

మెరుగైన వైద్యసేవలు అందించాలి



బ్రాహ్మణకొట్కూరు పీహెచ్‌సీ సెంటర్‌ను తనిఖీ చేస్తున్న డీఎంహెచ్ఓ వెంకటరమణ

నందికొట్కూరు రూరల్ : గ్రామీణ ప్రాంతాలలోని ప్రజలకు వైద్యులు మెరుగైన వైద్యసేవలు అందించాలని డీఎంహెచ్‌వో వెంకటరమణ సూచించారు. గురువారం మండల పరిధిలోని బ్రాహ్మణకొట్కూరు పీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ పీహెచ్‌సీలో ఓపీల సంఖ్యను పెంచాలని, వైద్యులు నిత్యం అందుబాటులో ఉండాలని సూచించారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యులు మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

మల్లన్న సేవలో ఆర్టీసీ చైర్మన్



చైర్మన్‌కు ఆహ్వానం పలుకుతున్న అధికారులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల శ్రీభ్రమరాంబామల్లికార్జునస్వామివార్లను గురువారం ఆంధ్రప్రదేశ్ ప్రజా రవాణా శాఖ (ఆర్టీసీ) చైర్మన్ ఎ.మల్లికార్జునరెడ్డి దర్శించుకున్నారు. వీరికి ప్రధానాలయ రాజగోపురం వద్ద ఆలయాధికారులు, అర్చకులు ఆలయ మర్యాదలతో ఆహ్వానం పలికారు. పూజల అనంతరం అమ్మవారి ఆశీర్వచన మండపంలో అర్చక వేదపండితులు ఆశీర్వచనాలు పలుకగా.. అధికారులు స్వామివార్ల శేషవస్త్రాలు, లడ్డూప్రసాదాలు, జ్ఞాపికను అందజేశారు.

ఘనంగా అశ్వర్థ నారాయణ కల్యాణం



తిమ్మాపురంలో కల్యాణం నిర్వహిస్తున్న దశ్యం

మహానంది: మండల కేంద్రం ఎం. తిమ్మాపురంలో గురువారం అశ్వర్థ నారాయణ లక్ష్మీదేవి (రావి వేప చెట్ల)కి కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. పురోహితులు రెంటచింతల రామమూర్తి ఆధ్వర్యంలో వేద మంత్రాలతో కార్తీక మాసంలో లోక క్షేమం కోసం కల్యాణాన్ని జరిపారు. గ్రామానికి చెందిన అట్ల లక్ష్మీదేవి, పాశం వెంకట లక్ష్మమ్మ, బోడెద్దుల లక్ష్మీదేవి తదితరులు ముఖ్య కార్యకర్తలుగా కల్యాణోత్సవాన్ని చేయించారు. బోడెద్దుల అరుణ, రమేష్, గాజుల తులషమ్మ, రాజీవ్ దంపతులు ఉభయదారులుగా వ్యవహరించి కల్యాణ తంతు పూర్తి చేశారు. అనంతరం పెద్దమ్మ దేవతకు గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు.

అయ్యప్ప పడిపూజ

మహానంది పుణ్యక్షేత్రంలో కార్తీక మాసం, గురువారం రాత్రి అయ్యప్ప స్వామి మహా పడిపూజ కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహానంది మండలంలోని వివిధ గ్రామాలలో దీక్ష స్వీకరించిన స్వాములు పూజకు హాజరయ్యారు. అయ్యప్ప స్వామికి వివిధ అభిషేకాలు నిర్వహించారు.

చెల్లెమ్మలకు జగనన్న పెళ్లికానుక

- కల్యాణమస్తు, షాదీతోఫా పేరుతో ఆర్థిక సాయం
- గత నెల 23న లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమచేసిన సీఎం వైఎస్ జగన్
- జిల్లా వ్యాప్తంగా ఈ ఏడాది 428 మందికి లబ్ధి



లబ్ధిదారులకు మెగా చెక్కును అందజేస్తున్న మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి (ఫైల్)

నందికొట్కూరు: పేద యువతుల వివాహానికి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ కల్యాణమస్తు, షాదీతోఫా పథకం కింద ఆర్థిక సాయం అందజేస్తూ అండగా నిలుస్తున్నారు. ఈ ఏడాది వివాహం చేసుకున్న వారికి నాల్గవ విడతగా సెప్టెంబర్ 23న తాడేపల్లిలోని ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయం నుంచి సీఎం జగనన్న వర్చువల్ విధానంలో వైఎస్సార్ కల్యాణమస్తు, షాదీతోఫా ఆర్థిక ప్రయోజనాన్ని వధువుల తల్లుల బ్యాంకు ఖాతాలకు జమ చేశారు.

నాలుగు విడుతల్లో 2,102 మందికి నగదు జమ..

2020లో జిల్లా వ్యాప్తంగా 273 మందికి, 2021లో 419 మందికి, 2022లో 982, 2023లో ఇప్పటి వరకు 428 వైఎస్సార్ కల్యాణమస్తు, వైఎస్సార్ షాదీతోఫా కింద రూ. 3,59,10,000 మేరకు సీఎం వైఎస్ జగనన్న వధువుల తల్లుల బ్యాంక్ ఖాతాలో బటన్ నొక్కి జమ చేశారు. 2020 నుంచి ఇప్పటి వరకు నంద్యాల జిల్లా వ్యాప్తంగా నాలుగు విడతలలో 2,102 జంటలకు రూ.17, 51, 10 కోట్లను వైఎస్సార్ కల్యాణమస్తు, వైఎస్సార్ షాదీతోఫా కింద ప్రభుత్వం లబ్ధిచేకూర్చింది. ఎస్సీలకు, ఎస్టీలకు వివాహం చేసుకున్న ఆడపడుచులకు రూ. లక్ష, ఎస్సీలు, ఎస్టీలు కులాంతర వివాహం చేసుకుంటే రూ.1.20 లక్షలు, బీసీలకు రూ. 50 వేలు, కులాంతరం వివాహం చేసుకున్న బీసీలకు రూ.75 వేలు, మైనార్టీలకు రూ.లక్ష, భవన కార్మికులకు రూ.40 వేలు, వైకల్యం కలిగిన వారికి రూ. 1,50,000 చొప్పున్న ప్రభుత్వం ఈ పథకం కింద అందజేస్తుంది.

మండలాల వారీగా వైఎస్సార్ కల్యాణమస్తు, వైఎస్సార్ షాదీతోఫా మంజూరు వివరాలు ..

మండలం	పెళ్లి చేసుకున్న జంటలు	జమ అయిన నగదు రూ.
ఆత్మకూరు	25	22,50,000
బండి ఆత్మకూరు	18	14,75,000
జూపాడుబంగ్లా	12	10,00,000
కొత్తపల్లి	05	4,00,000
మహానంది	05	3,50,000
మిడుతూరు	11	9,50,000
నందికొట్కూరు	17	16,50,000
పగిడ్యాల	8	6,50,000
పాములపాడు	8	6,50,000
వెలుగోడు	14	11,00,000

జగనన్నకు కృతజ్ఞతలు



బడుగు, బలహీన వర్గాలకు చెందిన వధువుల తల్లిదండ్రులకు ఆర్థిక సహాయం చేయడం చాలా సంతోషంగా ఉంది. ఆడపడుచులకు అన్నయ్య అండగా నిలిచి ఎంతో సహాయాన్ని అందించిన సీఎం వైస్ జగనన్నకు రుణపడి ఉంటాం. ఆర్థిక సహాయం ఇచ్చి ఆదుకున్న సీఎం జగనన్నకు కృతజ్ఞతలు.

– నీలంబ, రాజేష్, నందికొట్కూరు

చాలా సంతోషంగా ఉంది



మా అమ్మ ఖాతాలోకి రూ.లక్ష జమ అయ్యింది. పెళ్లి ఖర్చులకు ఇంత పెద్ద మొత్తం ఎవరూ ఇవ్వలేదు. మా లాంటి పేదలు జగనన్నను చూసుకుని ధైర్యంగా జీవించవచ్చు. కరోనా కష్ట కాలంలోనూ సంక్షేమ పథకాలు అందించి కుటుంబ పెద్దగా నిలిచారు. మళ్లీ సీఎంగా జగనన్ననే కావాలి. పేదలకు సహాయం చేసే జగనన్నను దేవుడు ఎల్లప్పుడూ చల్లగా చూడాలి.

– నాగమణి, అశ్వర్థామ, నందికొట్కూరు

ఆర్థిక భారం తగ్గింది



పేద కుటుంబాల్లో వివాహాలంటే అంత సులభం కాదు. మా కుటుంబానికి వైఎస్సార్ పెళ్లి కానుక అందడంతో చాలా వరకు ఆర్థిక భారం తగ్గిపోయింది. సీఎం జగనన్న అందించిన మొత్తంతో పెళ్లి ఖర్చుల కోసం చేసిన అప్పులు తీర్చుకున్నాం. ఈ పథకం పేద కుటుంబాలకు ఎంతో ఆసరగా ఉంటుంది. సీఎం జగనన్న ప్రభుత్వానికి మాలాంటి జంటలు రుణపడి ఉంటాయి. సమయం వచ్చినప్పుడు ఆ రుణం తీర్చుకుంటాం.

– శ్యామల, వెంకటేశ్వర్లు

పెళ్లికి చేసిన అప్పులు తీర్చాం



ప్రభుత్వం అందించిన సాయంతో మా కుమార్తె పెళ్లికి చేసిన అప్పులు తీర్చాము. పేదల కోసం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారు. అందులో మా కుటుంబానికి విద్యా దీవెన, వసతి దీవెన పథకాలు అందుతున్నాయి. వైఎస్సార్ కల్యామస్తు ఆర్థిక సహాయం మాకెంతగానో ఉపయోగపడనుంది.

– రాణి, రంగస్వామి

దేవుని పట్ల భక్తితో మెలగాలి

పాములపాడు : దేవుని పట్ల ప్రతి ఒక్కరూ భక్తితో మెలగాలని ముజావర్ జనాబ్ షేక్ బాదల్లా సాహెబ్ అన్నారు. గురువారం మండలంలోని కంబాలపల్లి గ్రామంలో మస్తాన్ వలి దర్గా సన్నిధిలో ఉరుసు నిర్వహణ కమిటీ సమావేశం నిర్వహించారు. 2024వ సంవత్సరం ఫిబ్రవరి 29న గంధం, మార్చి 1న ఉరుసు, 2న జియారత్ వేడుకలు నిర్వహించాలని నిర్ణయించారు. అలాగే దర్గా నిర్మాణానికి ఆర్థిక సహకారానికి అందరూ చేయూత నివ్వాలని, భక్తుల నుంచి చందాలు వసూలు చేసి దర్గా నిర్మాణం పూర్తి చేయాలని కోరారు. అనంతరం దర్గాలో ఫాతెహాలు నిర్వహించి ప్రసాదాలు పంపిణీ చేశారు. సమావేశంలో కమిటీ సభ్యులు మహ్మద్‌గని, ఖాజా, మహబూబ్‌సాహెబ్, లింగన్న, మౌలాలి, వలి, కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు రక్షణ కల్పించాలి

పగిడ్యాల: స్థానిక ఆదర్శ పాఠశాల(మోడల్) విద్యార్థినులకు బయటి వ్యక్తుల నుంచి రక్షణ కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం నాయకురాలు ఈశ్వరమ్మ, కేవీపీఎస్ జిల్లా నాయకురాలు గంధం ఉసేనమ్మ, ఎస్ఎఫ్ఐ నాయకులు అబ్దుల్లా కోరారు. ఈ మేరకు గురువారం తహసీల్దార్ భారతికి వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ పదిహేను రోజుల క్రితం మోడల్ స్కూల్ హాస్టల్ నుంచి ఓ విద్యార్థిని పరారైందని, దీనిని గోప్యంగా ఉంచారని చెప్పారు. పాఠశాల చుట్టూ ప్రహరీ నిర్మించకపోవడంతో ఆకతాయిలు పేట్రేగిపోతున్నారన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న హాస్టల్ వార్డెన్, ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకునేలా కలెక్టర్‌కు నివేదిక పంపాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు శేషు తదితరులు ఉన్నారు.

విద్యా, వైద్యానికి సీఎం పెద్దపీట

- ఎమ్మెల్యే తొరుగు ఆర్థర్
- తూడిచెర్లలో వైఎస్సార్ హెల్త్‌క్లినిక్ ప్రారంభం



వైఎస్సార్ హెల్త్‌క్లినిక్ భవన శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే తొగురు ఆర్థర్

జూపాడుబంగ్లా: విద్యా, వైద్య రంగాలకు పెద్దపీట వేసి ప్రతి ఒక్కరికీ ఇళ్లవద్దకే వైద్యం అందేలా చేసిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ అన్నారు. మండలంలోని తూడిచెర్ల గ్రామంలో రూ.21.80లక్షల వ్యయంతో నిర్మించిన వైఎస్సార్ హెల్త్‌క్లినిక్ భవనాన్ని, రూ.20 లక్షలు 'గడప గడపకు మన ప్రభుత్వం' ద్వారా మంజూరైన నిధులతో నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించారు. అనంతరం సర్పంచ్ బాలమద్దిలేటి అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆరోగ్యశ్రీ పథకం ద్వారా కార్పొరేట్ స్థాయి వైద్యం అందించి ప్రతి ఒక్కరూ క్షేమంగా, ఆరోగ్యవంతంగా ఉండేలా చేశారన్నారు. గ్రామాల్లో హెల్త్‌క్లినిక్ సెంటర్లు ఏర్పాటు చేసి ఫ్యామిలీ ప్రోగ్రాం ద్వారా ఇంటి వద్దకే వైద్యులు వచ్చి ఆరోగ్య పరీక్షలు చేసేలా చర్యలు తీసుకున్నారని తెలిపారు. అలాగే విద్యకూ ప్రాధాన్యతనిస్తూ ప్రతి పేదవిద్యార్థి ఆంగ్ల మాధ్యమంలో కార్పొరేట్ స్థాయిలో విద్యను అభ్యసించేలా నాడు-నేడు కింద పాఠశాలలు తీర్చిదిద్దారన్నారు. సీఎం జగనన్న అమలు చేసిన సంక్షేమ పథకాలను దృష్టిలో పెట్టుకొని ఆయనను మరోమారు ఆశీర్వదించాలని కోరారు.

అభివృద్ధి పథంలో నందికొట్కూరు నియోజకవర్గం

నియోజకవర్గంలో రూ.28.80 కోట్ల వ్యయంతో 72 సచివాలయాలు మంజూరు కాగా 33 భవనాలు పూర్తైనట్లు తెలిపారు. రూ.18 కోట్లతో 72 రైతు భరోసా కేంద్రాలు మంజూరు కాగా 15 ఆర్బీకేలు, రూ.11.22 కోట్ల వ్యయంతో 51హెల్త్ క్లినిక్‌లు మంజూరు కాగా 14 కేంద్రాల నిర్మాణం పనులు పూర్తి చేసినట్లు తెలిపారు. మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయని వాటిని త్వరగా పూర్తి చేస్తాన్నారు. రూ.4.80కోట్ల వ్యయంతో పారుమంచాల-మద్దూరు బీటీరోడ్డు నిర్మాణం, పారుమంచాల-తిమ్మాపురం రోడ్డు, పారుమంచాల-అలగనూరు రోడ్డు నిర్మాణాలు మంజూరు కాగా వాటి నిర్మాణం పనులు త్వరలో పూర్తిచేయించనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో పీఆర్ డీఈ ధనిబాబు, ఏఈ బషీర్, తహసీల్దార్ పుల్లయ్యయాదవ్, ఎంపీడీఓ నూర్జహాన్, ఎంపీపీ సువర్ణమ్మ, సర్పంచ్ బాలమద్దిలేటి, డాక్టర్ మౌనిక, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ కాంతారావు, ఏఓ కృష్ణారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు పద్మనాభయ్యశెట్టి, కోట్లమోక్షేశ్వరుడు, నీలకంఠేశ్వర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రూ.46 లక్షలతో మండ్లెంలో సిమెంటు రోడ్లకు భూమిపూజ

మండలంలోని మండ్లెం గ్రామంలో రూ.40లక్షల గడప గడపకు నిధులు, రూ.6లక్షల మండల పరిషత్ నిధులతో సిమెంటు రోడ్ల నిర్మాణానికి గురువారం జెడ్పీటీసీ జగదీశ్వరరెడ్డి, జేసీఎస్ మండల అధ్యక్షుడు నాగార్జునరెడ్డి, వైఎస్ ఎంపీపీ తోకలకృష్ణారెడ్డి, జిల్లా జాయింట సెక్రెటరీ కోసిక తిరుమలేశ్వరరెడ్డి భూమిపూజ చేశారు. కార్యక్రమంలో సచివాలయ ఇంజినీర్ వేణుగోపాల్, గంగాధర్‌రెడ్డి, యుగంధర్‌రెడ్డి, దొడ్డాసుధాకర్, నరేష్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మండ్లెంలో సిమెంటు రోడ్ల నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న జెడ్పీటీసీ జగదీశ్వరరెడ్డి

గ్రామాల అభివృద్ధికి సహకరించాలి



మహిళకు నీటి బిందె అందిస్తున్న ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి

- ఎథిక్స్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి
- మాధవరంలో మినరల్ వాటర్ ప్లాంట్ ప్రారంభం

వెలుగోడు: గ్రామాల అభివృద్ధిలో ప్రతి ఒక్కరి సహాయ సహకారాలు అవసరమని శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి అన్నారు. గురువారం మండలంలోని మాధవరం గ్రామంలో పీఎండీఎఫ్ నిధులు రూ.6 లక్షలతో నిర్మించిన మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఎమ్మెల్యే ప్రారంభించి గ్రామస్తులకు అంకితం చేశారు. శిల్పా చక్రపాణిరెడ్డి మాట్లాడుతూ.. ప్రజా ప్రయోజనార్థం గ్రామస్తులకు పీఎండీఎఫ్ నిధులతో ఉచిత మినరల్ వాటర్ అందించాలనే లక్ష్యంతో వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. నీటిని దుర్వినియోగం చేసుకోకుండా సురక్షిత మంచినీటిని సేవించాలని సూచించారు. గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యేకు వైఎస్సార్‌సీపీ గ్రామ నాయకులు, మహిళలు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో నియోజకవర్గ నాయకుడు శిల్పా భువనేశ్వర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు అంబాల ప్రభాకర్ రెడ్డి, ఎంపీపీ లాలం రమేష్, గ్రామ నాయకులు శ్రీనివాసులు, విజయ్ కుమార్ చౌదరి, నాగేశ్వరరెడ్డి, సర్పంచ్‌లు బ్రహ్మానందరెడ్డి, వేల్పుల జయపాల్, వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ ఈశ్వరమ్మ పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ పాలనలోనే సంక్షేమ పథకాలు



బోర్డు ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఆత్మకూరు: పేదలకు సంక్షేమ పథకాలు వైఎస్సార్‌సీపీతోనే సాధ్యమని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు రాజమోహన్‌రెడ్డి, కోట్ల నాగేశ్వరరెడ్డి, మార్కెట్‌యార్డ్ చైర్మన్ బాలస్వామియాదవ్, లక్ష్మిరెడ్డి అన్నారు. మండలంలోని వెంకటాపురం గ్రామంలో గురువారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహిచారు. వెంకటాపురం గ్రామసచివాలయ పరిధిలో రూ.19,97,43,636 లబ్దిదారుల ఖాతాల్లో జమ చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు రవినాయక్, రమేష్, కొత్త రామాపురం శివరాం, ఎలిషా తదితరులు పాల్గొన్నారు.

ఉజ్వల పథకాన్ని సద్వినియోగం చేసుకోండి

ఆత్మకూరు: దేశవ్యాప్తంగా ప్రధాన మంత్రి ఉజ్వల యోజన కింద గ్యాస్ లేని మహిళలకు ఉచితంగా కనెక్షన్ అందజేస్తున్నారని, ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని గౌరీ శంకర్ గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకుడు గంగాధర్‌రెడ్డి తెలిపారు. ఆధార్, రేషన్ కార్డు, బ్యాంక్ అకౌంట్ తీసుకుని ఆత్మకూరులోని గౌరీశంకర గ్యాస్ ఏజెన్సీలో సంప్రదించాలన్నారు. ఈ నెల 30వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు.

ఓటరు నమోదుపై అవగాహన



విద్యార్థులతో ర్యాలీ నిర్వహిస్తున్న తహసీల్దార్, ఎంపీడీఓ

పాములపాడు: ఓటు హక్కు నమోదుపై గురువారం తహసీల్దార్ రత్నరాధిక, ఎంపీడీఓ గోపీకృష్ణ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని ఏఎస్ఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. బస్టాండ్ సెంటరులో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ 18 సంవత్సరాలు పూర్తయిన ప్రతి యువతీ, యువకుడు తప్పనిసరిగా ఓటు హక్కు నమోదు చేయించుకోవాలని సూచించారు. డిప్యూటీ తహసీల్దార్ పఠాన్‌బాబు, వీఆర్వో ముర్తుజావలి పాల్గొన్నారు.

పగిడ్యాల: స్థానిక తహసీల్దార్ కార్యాలయం నుంచి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులతో ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ చేపట్టారు. బస్టాండులో విద్యార్థులు మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేశారు. ఎంపీడీఓ వెంకటరమణ, ఎంఈఓ సుభాన్, జెడ్పీటీసీ పుల్యాల దివ్య, ఎంపీపీ మండ్ల మల్లేశ్వరి, సర్పంచ్ పెరుమాళ్ల శేషన్న పాల్గొన్నారు.

క్రీడారంగానికి ప్రాధాన్యం



క్రీడా కిట్లను పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ పుల్యాల దివ్య, ఎంపీపీ మండ్ల మల్లేశ్వరి

పగిడ్యాల: క్రీడా రంగానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేశారని జెడ్పీటీసీ పుల్యాల దివ్య, ఎంపీపీ మండ్ల మల్లేశ్వరి అన్నారు. ఇందులో భాగంగానే ఆడుదాం.. ఆంధ్ర పోటీలను ఈనెల 15 నుంచి అన్ని గ్రామ సచివాలయాలల్లో నిర్వహిస్తున్నట్లు తెలపారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులకు క్రీడా సామగ్రి పంపిణీ కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటరమణ, తహసీల్దార్ భారతి, ఈఓఆర్డీ నాగేంద్రయ్య, ఎంఈఓ సుభాన్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పుల్యాల నాగిరెడ్డి, సర్పంచ్ పెరుమాళ్ల శేషన్న పాల్గొన్నారు.

మండలానికి చేరిన క్రీడా సామగ్రి

పాములపాడు: ఆడుదాం ఆంధ్ర క్రీడా సామగ్రి గురువారం ఎంపీడీఓ కార్యాలయానికి చేరాయి. వాటిని ఎంపీడీఓ గోపీకృష్ణ పరిశీలించారు.

సెల్ టవర్ నిర్మాణం ఆపండి

నందికొట్కూరు: పట్టణంలోని వడ్డేపేటలో సెల్ టవర్ నిర్మాణానికి గురువారం జేసీబీతో పాటు సామగ్రి తీసుకురాగా కాలనీ వాసులు అడ్డుకున్నారు. అనంతరం టవర్ నిర్మాణం ఆపాలని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు మజీద్‌మియ్యా, రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ కిషోర్‌కు, కౌన్సిలరు చాంద్‌బాషాకు వినతి పత్రం అందజేశారు. ప్రజల అభిప్రాయానికి వ్యతిరేకంగా నిర్మించే సెల్ టవర్ నిర్మాణంపై చర్యలు తీసుకుంటామని కమిషనర్ కాలనీ ప్రజలకు హామీచ్చారు. కౌన్సిలరు రవూఫ్, వైఎస్సార్‌సీపీ నాయకులు అబుబక్కర్, ఆర్టీసీ బాబు, కాలనీ ప్రజలు ఖలీల్, రహిమాన్, నాసీర్, రామచంద్రుడు పాల్గొన్నారు.

12 నుంచి అంగన్‌వాడీల సమ్మె

పాములపాడు: అంగన్‌వాడీలకు జీతాల పెంపు కోసం ఈ నెల 12 నుంచి నిరవధిక సమ్మెలోకి వెళ్లనున్నట్లు అంగన్‌వాడీ సంఘం ప్రాజెక్టు కార్యదర్శి శివలక్ష్మి తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని బస్టాండ్ సెంటరులో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు నాగమణి, నాగమద్దమ్మ, శ్రీలత, నాగమ్మ తదితరులు పాల్గొన్నారు.

నేడు 'పల్లెకు పోదాం'

మహానంది: తమ్మడపల్లె గ్రామంలోని సచివాలయం వద్ద శుక్రవారం పల్లెకు పోదాం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్సీపీ మండల అధ్యక్షుడు కొమ్మాపాల మహేశ్వర రెడ్డి గురువారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ మధ్యాహ్నం 3 గంటల నుంచి వైఏపీ నీడ్స్ జగన్, పల్లెకు పోదాం కార్యక్రమాలు ఉంటాయన్నారు. అధికారులు,ప్రజా ప్రతినిధులు నాయకులు, వలంటీర్లు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

పంటకోత ప్రయోగం

మహానంది: ఒక గ్రామంలో నిర్వహించిన నాలుగు పంట కోత ప్రయోగాలలో వచ్చిన దిగుబడుల సరాసరి ఆధారంగా పంట బీమాను ప్రభుత్వం నిర్ణయిస్తుందని ఏఓ నాగేశ్వర రెడ్డి తెలిపారు. సీతారామపురం గ్రామంలో గురువారం వరి పంట పైన డాక్టర్ వైఎస్సార్ ఉచిత పంటల బీమా పథకం, ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన కింద వరి పంటలో పంట కోత ప్రయోగం నిర్వహించారు. రైతు మహేశ్వరమ్మ పొలంలో పంట కోత ప్రయోగం చేయగా 19 కేజీల 600 గ్రాములు దిగుబడి వచ్చిందని తెలిపారు. ఈ ఖరీఫ్ సీజన్లో అన్ని గ్రామాలలో వరి దిగుబడులు ఆశాజనకంగా ఉన్నాయన్నారు. కార్యక్రమంలో ఇన్సూరెన్స్ అధికారి అరుణ్ కుమార్, వ్యవసాయ విస్తరణ అధికారి శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ కేసులను పరిష్కరించాలి



పోలీసులకు సూచనలిస్తున్న డీఎస్పీ శ్రీనివాసరావు

కొత్తపల్లి: స్టేషన్ పరిధిలో పెండింగ్‌లో ఉన్న కేసులన్నింటినీ త్వరితగతిన పరిష్కారం చేయాలని ఆత్మకూరు డీఎస్పీ శ్రీనివాసరావు అన్నారు. గురువారం స్థానిక పోలీస్ స్టేషన్‌ను సీఐ నాగభూషణ్‌తో కలిసి తనిఖీ చేశారు. స్టేషన్ పరిసరాలను, పోలీసు క్వార్టర్స్‌ను తనిఖీ చేశారు. స్టేషన్ ఆవరణలో పూల మొక్కలు నాటారు. డీఎస్పీ మాట్లాడుతూ స్టేషన్‌కు వచ్చే బాధితులతో సిబ్బంది స్నేహపూర్వకంగా మెలగాలన్నారు. ఎస్ఐ హుస్సేన్‌బాషాకు, సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. అదేవిధంగా శివపురం గ్రామంలో ఇరువర్గాల మధ్య ఉన్న పాతకేసు వివరాలను పరిశీలించి, వారితో మాట్లాడి శాంతియుతంగా సమస్యను పరిష్కారం చేసుకోవాలని సూచించారు. అనంతరం మండలంలోని దుద్యాల గ్రామానికి చేరుకొని గ్రామంలో ఉన్న ఎస్సీ, ఎస్టీ కేసుపై దర్యాప్తు చేశారు.

బాధితులకు కార్తీక్‌రెడ్డి పరామర్శ



మాట్లాడుతున్న శిల్పా కార్తీక్‌రెడ్డి

ఆత్మకూరు: పట్టణానికి చెందిన ముస్లిం మైనార్టీ నాయకుడు షిరావుద్దీన్ అనారోగ్యంతో మృతి చెందడంతో ఆయన కుటుంబసభ్యులను గురువారం వైఎస్సార్‌సీపీ నాయకుడు శిల్పా కార్తీక్‌రెడ్డి పరామర్శించారు. ఆర్థిక సహాయం అందజేసి, తాము కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. అలాగే ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన పాత్రికేయుడు నాగరత్నంను పరామర్శించారు. అనంతరం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పువ్వాడ భాస్కర్‌ను ఇటీవల హానరరీ వార్డెన్‌గా నియమించడంతో పార్టీ నాయకులు, ఆర్యవైశ్యసంఘం నాయకులు కార్తీక్‌రెడ్డిని సన్మానించారు. వైఎస్సార్‌సీపీ పట్టణ, మండల అధ్యక్షులు సయ్యద్‌మీర్, రాజమోహన్‌రెడ్డి, దామోదర్, భరద్వాజ్ తదితరులు పాల్గొన్నారు.

బడి ఈడు పిల్లలు బడి బయట ఉండరాదు



చెంచుగిరిజనులతో మాట్లాడుతున్న ఐటీడీఏ పీఓ

శ్రీశైలంప్రాజెక్ట్: బడి ఈడు పిల్లలు ఎటువంటి పరిస్థితుల్లోనూ బడి బయట ఉండరాదని విద్యాశాఖ అధికారులను ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి డాక్టర్ బి రవీంద్రారెడ్డి ఆదేశించారు. గురువారం ఐటీడీఏ కార్యాలయంలో విద్యాశాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. శ్రీశైలం మేకలబండలోని చెంచుకాలనీలో ఇంటింటి సర్వే నిర్వహించి.. 11 మంది విద్యార్థులు దీర్ఘకాల గైర్హాజరు, ఐదుగురు బడిలో చేరని వారిని గుర్తించారు. వారందరినీ బడిలో చేర్పించేలా చర్యలు చేపట్టారు. గూడేనికి దగ్గరలో పాఠశాలల్లో వారిని చేర్చుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో పీఆర్పీలు రామాంజినేయులు, ఏంఈఓలు శక్రూనాయక్, సీఆర్పీ రామాంజినేయులు తదితరులు ఉన్నారు.

నందికొట్కూరు రూరల్ : బడి బయటి పిల్లలు బడికి వెళ్లే విధంగా అధికారులు అవగాహన కల్పించాలని డీపీవో మంజులవాణి సూచించారు. గురువారం పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో మండలంలోని ప్రభుత్వ పాఠశాలల హెచ్ఎంలతో సమావేశం నిర్వహించారు. ఎంఈవో-2 శ్రీనివాసులు, ఈవోఆర్డీ సంజన్న, తదితరులు పాల్గొన్నారు.

జూపాడుబంగ్లా: మండలంలోని తాటిపాడు, భాస్కరాపురం గ్రామంలో ఈఓపీఆర్డీ మధుమోహన చక్రవర్తి, ఎంఈఓ-2 శ్రీనివాసులు ఇంటింటికీ వెళ్లి బడికి వెళ్లని విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడి బడికి పంపించాలని ఒప్పించారు. భాస్కరాపురం గ్రామానికి చెందిన షేక్ సమీరా, షేక్ రుక్సానా లను వెంటనే బడికి పంపించాలని తల్లిదండ్రులకు సూచించారు. అలాగే బడిబయట ఉన్న మద్దూరు రాజ్‌కుమార్, సుమంత్‌కుమార్‌ల తల్లిదండ్రులతో మాట్లాడి వారిని సక్రమంగా బడికి వెళ్లేలా చేశారు. తాటిపాడులో 10మంది విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడి వారిని వెంటనే బడికి వెళ్లేలా చేశారు.

నందికొట్కూరు: పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల(కోటా) విద్యార్థులు హెచ్ఎం సలీంబాషా ఆధ్వర్యంలో బడి ఈడు పిల్లలు బడిలోనే ఉండాలంటూ ర్యాలీ నిర్వహించారు. పీఎంసీ చైర్మన్ మద్దిలేటి, ఉపాధ్యాయులు శారదమ్మ, అరుణ, విజయ భారతి, లలితమ్మ తదితరులు పాల్గొన్నారు.

పాములపాడు: నోడల్ ఆఫీసర్ రవీంద్రద్రకుమార్, ఎంపీడీఓ గోపీక్రిష్ణ, ఎంఈఓ 2 సుభాషిణీ దేవి, ఏపీఎం అనురాధ వారి బృందం సభ్యులతో కిలిసి గ్రామాల్లో జీఈఆర్‌సర్వే కొనసాగించారు. క్రిష్ణారావుపేట గ్రామంలో 9వ తరగతి చదివి ఇంటి వద్ద ఉన్న ఇద్దరు పిల్లలను 10 వతరగతి ఓపెన్ స్కూలు ఫీజు కట్టించారు. 2వ తరగతిలో ఒక అబ్బాయిని చేర్పించారు. మండల కేంద్రంలో శ్రీశారద విద్యానికేతన్ విద్యార్థులతో సీఆర్పీ కరుణ ర్యాలీ నిర్వహించారు.